


# ఖరీదైన మనసులు

వి.యస్. లక్ష్మి

ఇబ్రహీం అండ్ అబ్రహామ్స్ ట్రాన్స్‌పోర్ట్సు కంపెనీకి అవసరమైన సిబ్బందికి ఇంటర్వ్యూ అవుతుందావేళ. ఆంధ్రా ట్రాన్స్‌పోర్ట్సు వాళ్ళు పెడుతున్నట్టుండే చిన్న ఆఫీసు గదులన్నీ ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులతో కిటకిటలాడుతున్నాయి. లోపలిగా ఉన్న గుహలాంటి పెద్ద గదిలో ఇంటర్వ్యూ చేసే నలుగురు పెద్ద మనుషులూ కూర్చుని ఉన్నారు. వాళ్ళ దగ్గర మొత్తం 20 ఖాళీలున్నాయనీ, అందులో అన్ని రకాల ఉద్యోగాలూ ఉంటాయనీ కావాలనుకున్న వాళ్ళు దరఖాస్తు పెట్టుకోవచ్చని ప్రకటించారు. ప్రకటన చిత్రంగా తోచినా, నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న కొన్ని వందల మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. ఏదో ఒకటి—అసలు ఒక ఉద్యోగమంటూ దొరికితే గంజినీళ్ళన్నా తాగి బతక వచ్చు అనుకున్న దురదృష్టవంతులు చాలా మందే ఉన్నారు.

అందులోంచి బాగా చదువుకున్న వాళ్ళని రెండు వందల మందిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలిచారు. అందులో ఆడవాళ్ళు కూడా చాలా మంది ఉన్నారు. కొందరు శుభ్రంగా ఉన్నారు. కొందరు టిప్‌టాప్‌గా ఉన్నారు. కొందరు హుషారుగా ఉన్నారు. కొందరు నిరాడంబరంగా ఉన్నారు. కొందరు నీరసంగా కూడా ఉన్నారు. కొందరు ఎందుకో కంగారుపడుతున్నట్టున్నారు.

సరిగ్గా పదిన్నర అయింది. బంట్రోతు బయటికి వచ్చి ఒక్కొక్కళ్ళ పేరే చదివి లోపలకు పంపిస్తున్నాడు. వెళ్ళిన వాళ్ళు ఏమైపోతున్నారని అనుమానం వచ్చిందొక అమ్మాయికి. బంట్రోతు నడిగితే వేరే గుమ్మంలోంచి వెళ్ళే ఏర్పాటు చేశారని చెప్పాడు.

నిరాడంబరంగా, సామాన్యంగా, అందంగా ఉన్న పార్వతి వంతు కూడా వచ్చింది. బంట్రోతు ఆమె పేరు పిలవగానే సర్టిఫికేట్లూ అవీ ఉన్న పేపరు సంచిని తీసుకొని లోపలికి వెళ్ళింది. నలుగురూ కూర్చుని ఉన్నారు. 'వీళ్ళు చాలా ఖరీదైన మనుషుల్లా కనిపిస్తున్నారు—వీళ్ళకి ఖరీదైన మనసులు ఉన్నాయో లేదో గాని' అనుకుంది మనసులో.

పార్వతిని చూడగానే చాలా బీదవాళ్ళ అమ్మాయిలా ఉంది పాపం! అనుకున్నారు నలుగురూను.

అందులో ఒకతను "పూర్" అన్నాడు నిర్లక్ష్యంగా. ఇంకా వాళ్ళు ఉద్యోగం ఇవ్వలేదు. అప్పుడే అధికారం! పార్వతికి చాలా కష్టమనిపించింది. అమర్యాదగా మాట్లాడడానికి సిగ్గిలా తోచిపోయిందో

అనుకుని "క్షమించండి. మీరు మమ్మల్ని ఇంటర్వ్యూకి పిలిచారే గాని, మీ హోదా ప్రదర్శించుకునేందుకు కాదనుకుంటాను. మర్యాద ఇచ్చి, మర్యాద పుచ్చుకోవడం బావుంటుంది" అంది అలాగే నిలబడి. నలుగురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఈసారి మరొకతను కల్పించుకుని, "కూర్చోండి, పార్వతిగారూ" అన్నాడు. "థాంక్స్" అంటూ పార్వతి కూర్చుంది.

అంతా గొంతు సవరించుకున్నారు. పూర్తి, పేరూ అడిగారు. ఆమె ఎంతో చక్కగా అన్నిటికీ సమాధానాలు చెప్పింది. అర్హతలు కూడా అన్నీ సరిపోయాయి.

"మీరు సెక్రెటరీ పోస్టుకి కాదూ అప్లై చేసింది?" అన్నాడు.

"అవును" అంది పార్వతి.

"చివరగా — ఇవన్నీ వ్యక్తి నడవడికి సంబంధించి ఉంటాయి మా ప్రశ్న లన్నీను. మీకేం అభ్యంతరం లేదు కదా?" అన్నా డొకతను హుషారుగా.

"అబ్బే! అలాంటిదేం లేదు. అడగండి" అంది పార్వతి చిరునవ్వుతో.

"చూడండి—మీ కీ ఉద్యోగం చాలాఅవసరమా?"

"అవును. చాలా అవసరం."

"ఇది రాలేదనుకోండి. మీరు చాలా బాధపడవలసి వస్తుంది కదూ? మీ మీద కుటుంబభారం ఉంది కదూ?"

"అవును. మా ఇంట్లో ప్రస్తుతానికి నేనే పెద్దదిక్కుని. అందుకే ఉద్యోగం కోసం ఇంతగా వెతుక్కోవలసి వచ్చింది."

"మీ కసలు ఏవైనా ప్రిన్సిపల్స్—అంటే సిద్ధాంతాలు లాంటివి ఉన్నాయా?"

"ఉన్నాయి."

"ఒకవేళ ఎప్పుడైనా సిద్ధాంతానికీ, మీ పరిస్థితులకీ యుద్ధం వస్తే మీరేం చేస్తారు? వాటిని అధిగమించి సుఖంగా బయట పడతారా? లేక లొంగిపోతారా?"

"ఏ పరిస్థితుల్లోనూ నేను నా సిద్ధాంతాన్ని విడిచిపెట్టుకోను."

"అంత ఆత్మవిశ్వాసం ఉందన్నమాట!" ఇంచుమించు వేళాకోళం చేస్తున్నట్లే అన్నాడు.

పార్వతికి మనసు చివుక్కుమంది కాని, మర్యాదకి భంగం కలగకుండా అలాగే శాంతంగా, స్థిమితంగా కూర్చుంది.

"మీరేమో అందంగా ఉన్నారు. వయస్సులో ఉన్నారు. కంపెనీ అన్నాక మా యజమానులకు ఎంతో కొంత లొంగి ఉండవలసి ఉంటుంది. అంటే ఎప్పుడైనా — అంటే మాతో ... మాకు కంపెనీ ఇవ్వడానికి మాకూడా అలా ఎక్కడికైనా రావలసి వస్తుంది. కొంచెం అటూ ఇటూగా ఉండవలసి వస్తుంది, మరి మీకేం అభ్యంతరం లేదుకదా?"

"అభ్యంతరం తప్పకుండా ఉంది. క్షమించాలి, మీరు నా కివ్వబోయే ఉద్యోగ బాధ్యతలలో ఇది కూడా ఒక బాధ్యత అన్నమాట! అవునా?"

"కాదనుకోండి. కాని ఎప్పుడైనా, అలా చక్కగా అడ్జస్ట్ అయిపోవలసి ఉంటుంది. అందుకనే ముందే చెబుతున్నాం."

"క్షమించాలి, నేనలా అడ్జస్ట్ అవలేనండీ!"

"ఓహో అలాగా? అయితే మీరు చాలా ప్యూరిటాన్ అన్నమాట. ఇలా అయితే ఉద్యోగం దొరకడం చాలా కష్టమే మరి! మీకు కావలసిన పరిస్థితులు ఇంకా చాలా రోజుల దాకా కలిసిరాక పోవచ్చు, మరెలా?"

"ఫర్వాలేదు, వచ్చేదాకా వేచి ఉండగలను."

"సరే! ఏమీ అనుకోకండి! మరో ప్రశ్న!"

"ఏమీ అనుకోను. అడగండి."

"మీకు మీ మతం గురించి ఎలాంటి అభిప్రాయం ఉంది? మీ మతం మంచిదా? ఇతర మతాలు మంచివా? లేక ప్రపంచంలో మీ మతానికి మించిన మతం లేనేలేదా?"

"మా హిందూమతంమీద నాకు అపారమైన గౌరవం ఉంది. ఇతర మతాలపట్ల గౌరవం, సహనం కలిగి ఉండాలన్న సిద్ధాంతం ఉంది."

"అయితే మీ మతాన్ని విడిచిపెట్టి ఏ మతాన్నీ స్వీకరించనంటారు?"

"అయితే, ఈ ఉద్యోగం సంపాదించడానికి నేను ఏ మతం పుచ్చుకోవలసి ఉంటుంది?"

"ఇక్కడ మాలో ఇద్దరం క్రైస్తవులం, ఇద్దరు ముస్లిములం. మీ ఇష్టం—క్రైస్తవ మతమైనా సరే, ఇస్లామైనా సరే!"

"ఆహా అలాగా?"

"అయితే మీ ఉద్దేశం? క్షమించాలి ఇలా అడగవలసి వచ్చినందుకు."

"ఫర్వాలేదు. కానీ నా దురదృష్టం కొద్దీ నేను ఏ మతం స్వీకరించే స్థితిలో లేను. ఏ పరిస్థితిలోనూ నా మతాన్ని విడిచి పెట్టను" అంటూ తలవంచుకుంది పార్వతి.

"మా ప్రశ్న లన్నింటికీ ఎంతో ఓర్పుతో, చిరునవ్వుతో, చక్కగా సమాధానాలు చెప్పారు. థాంక్స్. ఇంకేం అడగవలసినవి లేవు. మీరింక వెళ్ళవచ్చు" అన్నాడు మరో అతను.

పార్వతి మెల్లగా లేచి కాగితాలూ, అవీ పట్టుకుని ఇవతలకు వచ్చేసింది. ఇనక ఆ ఉద్యోగం తన కెలాగూ రాదని నిర్ధారణ చేసుకుని మరో ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఒక రోజు మధ్యాహ్నం రెండు గంటలకి ఎండలో బాగా తిరిగి తిరిగి ఇంటికి వచ్చేసరికి బల్లమీద ఒక కవర్ పడి ఉండటం చూసింది పార్వతి. పైన "ఇబ్రహీమ్ అండ్ అబ్రహామ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ" నుంచి వచ్చినట్లు ఉంది.


ఆశ్చర్యంతో విప్పి చూసింది. తన కళ్ళను తానే నమ్మలేక పోయింది. వాళ్ళకి తన ప్రవర్తన, సిద్ధాంతాలూ నచ్చడం వల్ల తనను వాళ్ళ సెక్రటరీగా వేసుకున్నట్టూ, వెంటనే వచ్చి పనిలో చేరవలసిందన్నట్టూ ఉంది. ★

(శ్రీమతి మాదిరెడ్డి సులోచన ప్రథమ వర్ధంతి సందర్భంగా అభ్యుదయ వేదిక, హైదరాబాద్ వారు నిర్వహించిన కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన రచన.)

నిశి కనులు పైకి ఎత్తి
హుషారైన గళం ఎత్తి
పది పారిజాతాలు
ఎదంపై వెదజల్లి

శరద్ శశి వెన్నెలతో
వింజామర చేసి చూడు
కలల గాలి కెరటంతో
కే నోపి కట్టి వూగు

శిశిరం నీ చుట్టూ
చిన్న కోట కట్టనియ్యి
నిదాఘాల నిధానాలు
సదా నువ్వు మార్చవచ్చు




ఈ ఉగాది....
బి.శశి

అన్నా ఈ లోకం
కన్నతల్లి వంటిది
ఆటంబాంబుల కోసం
ఆరాటం దేనికి?

ఆకుపచ్చని బయళ్ళ వెంట
అరవిచ్చిన పూలవాన
గలగలమన్న నవ్వునట్లు
తరుకు లీను గోదావరి.

గతం మరచి ఒక్కసారి
పదింపరచి గుండె గదిని
ప్రతి రోజూ ఉగాదిగా
పండుగ మనం చేసేద్దాం.